

సభకు హాజరైన జనసందోహం





సైకిల్ చిహ్నం చూపిస్తున్న ఓ పెద్దాయన



మహిళల ఉత్సాహం

గెలుపు మనదే..

ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలే

- రాష్ట్రంలో టీడీపీ, జనసేన సునామీ
- పర్చూరు రాజకీయం రాష్ట్రానికే కేస్‌స్టడీ
- రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

ప్రభుత్వ అవాంతరాలు ఎదిరించి.. పోలీసుల ఆంక్షలు అధిగమించి.. జనసంద్రం ఇంకొల్లుకు తరలివచ్చింది. భారీగా జనం తరలివచ్చిన బహిరంగ సభలో మీ కోసం వచ్చా.. మీ వెంటే ఉంటా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు అభయం ఇచ్చారు. సీఎం జగన్ నుంచి వైసీపీ నేతల అక్రమాలపై సెటైర్లు వేస్తూ, జగన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూ, అక్రమాలను మననం చేస్తూ చంద్రబాబు చేసిన ప్రసంగం సభికులను ఉర్రూతలూగించింది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని 7 నియోజక వర్గాల్లోని అక్రమాలను ఎండగడుతూ, నేతలకు చురకలు అంటిస్తూ, అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే హామీలను వివరించారు. ఎన్నికలకు పార్టీ శ్రేణు లు సిద్ధంగా ఉండాలని పిలుపిచ్చారు.

చీరాల, ఫిబ్రవరి 17: గెలుపు మనదే.. అనుమానం లేదు.. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి.. మీ కోసం పనిచేస్తా.. రాజకీయాన్ని కలుషితం చేసిందెవరో తెలుసుగా.. అతడ్ని సాగనంపుదాం. ఇక మిగిలింది 52 రోజులే. కౌంట్ డౌన్ స్టార్టయ్యింది. ఇక ఫ్యాన్ రెక్కలు ముక్కలు ముక్కలే.. తెరలు కట్టుకుని తిరగడం కాదు.. పర్చూరు పౌరుషం చూడు జగన్‌రెడ్డి. సభకు వచ్చిన జనసంద్రాన్ని టీవీలలో చూడు. చూస్తే రాత్రికి నిద్ర కూడా రాదు. నీ డబ్బు సంచులు, అక్రమ కేసులతో ఎవరినీ ఆపలేవు.. అని బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులోని తారక రామ విజయభేరి ప్రాంగణంలో జరిగిన రా.. కదలి రా సభలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సీఎం జగన్ పెట్టే ప్రతీ స్కీం వెనుక ఓ స్కాం ఉంటుంది. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ ఇలా ప్రతి అంశంలో వైసీపీ ప్రభుత్వానిది అక్రమార్జనే. సహజ వనరులను దోపిడీ చేసి సీఎం జగన్ తన ఆస్తులు పెంచుకు న్నాడు. రాష్ట్ర ప్రజలను బాధితులను, పేదల ను చేశాడని ధ్వజ మెత్తారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు సైకో బాధితులే. అందులో నేను ఉన్నాను.. పవన్‌కళ్యాణ్ ఉన్నారు.. ప్రజలందరు కూడా ఉన్నారని చంద్రబాబు వివరించారు.

పర్చూరులో పాలకపార్టీ చేసిన అక్రమాలు రాష్ట్రానికి కేస్ స్టడీ. విధ్వంసం, దొంగ ఓట్లు, అక్రమ కేసులు ఇలాంటివి ఎన్నో చేశారు. ఓట్లు తొలగించడానికి దాదాపు 14,000 ఫాం 7లు దరఖాస్తు చేశారు. తాడేపల్లిలో పెద్ద సైకో ఉంటే ఇక్కడ చిన్న సైకో ఉన్నారు. 2019లో చీరాలలో ఛీకొట్టించుకున్న వ్యక్తి ఇక్కడ దొంగ ఓట్లు చేర్చడం, గ్రానైట్ వ్యాపారులపై అక్రమ కేసులు బనాయించాడు. ఆ బకాసురుడ్ని కాదని మరొకతన్ని తెచ్చారు. ఎవరు వచ్చినా ఇక్కడ సాంబశివరావు గెలుపును ఆపలేరు. తనిఖీల పేరుతో అధికారుల వాహనాల్లోనే కారం, కర్రలు తీసుకువచ్చారు. వాటిపై సాంబశివ రావు పోరాడారు. గ్రానైట్ కేసులపై అద్దంకిలో ఎమ్మెల్యే రవికుమార్ సుప్రీం కోర్టు వరకు వెళ్లి పోరాడారు. కొండేపి ఎమ్మెల్యే బలావీరాంజనేయస్వామి సంతనూలతపాడు ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ధీటుగా వ్యవహరించారు. ప్రతి నాయకుడు ఇలానే పోరాడాలి.



చంద్రబాబును సన్మానిస్తున్న ముస్లిం,ఇతర నాయకులు

వైసీపీ నేతలకు చురకలు


- వేమూరులో మంత్రి అక్కడ చెత్త, సంతనూతలపాడులో ఏమవుతాడు. అక్కడ కూడా చెత్తే కదా. ఆ చెత్తను ఎక్కడకు పంపాలి డంపింగ్ యార్డుకు కదా. ఇసుక అక్రమాలలో రూ.100 కోట్లుపైగా సంపాదించాడు.
- చీరాలలో 2019లో మనం గెలిపించిన దుర్మార్గుడు కష్టాల్లో వెళ్లిపోయాడు. మరలా గెలిపిస్తే మన దగ్గరకు వస్తామంటున్నారు. మనం నమ్ముతామా.
- రేపల్లెలో మోపిదేవి ఇక శాశ్వతం గా పేకాట ఆడుకోవడమే.
- బాపట్లలో కోనది కోట్లు కొల్లగొట్టిన ఘనత. కోన రఘుపతి కమర్షియల్ రఘుపతిగా మారాడు. ఇంటి పర్మిషన్, రియల్ ఎస్టేట్ వెంచర్ వేయాలన్నా డబ్బు చెల్లించాల్సిందే.
- బాపట్ల ఎంపీకి చెరుకుతోటలు కాల్చడం, కబ్జాలు, బెదిరింపులు, మట్టి, గ్రావెల్ దోపిడీ మాత్రమే తెలుసు.

చంద్రబాబుది పాలనా దక్షత

గతంలో కొమ్మమూరు, సాగర్ కాలువలకు తక్కువ నీరున్నప్పుడు కూడా రైతులు ఎక్కువ పంటలు పండించారని, అది చంద్రబాబు పరిపాలన దక్షతకు నిదర్శనమని ఏలూరి సాంబశివరావు తెలిపారు. ఇప్పుడు వాటర్ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రా.. కదలి రా సభ జరగకుండా అనేక కుట్రలు చేశారని వాటన్నింటిని ఎదుర్కొన్నామన్నారు. తాడికొండ, అద్దంకి, రేపల్లె ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, డోలా బాలవీరాంజనేయస్వామి, చీరాల, బాపట్ల, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఎం.ఎం కొండయ్య, వేగేశన నరేంద్రవర్మ, బి.ఎన్ విజయ్‌కుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎంపీ శ్రీరాం మా ల్యాద్రి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, విజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ నియంత పాలనకు చరమ గీతం పాడదామన్నారు. జగన్‌కు టీడీపీ, జనసేన శ్రేణులు కుర్చీ మడత పెట్టాలని పిలుపునిచ్చారు. జగన్ రెడ్డిని సాగనం పేందుకు సైకిల్, గ్లాస్ గుర్తులపై బటన్ నొక్కాలన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ప్రసంగిస్తున్న వేగేశన నరేంద్రవర్మ



ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి

అందరి బాధ్యత నాదే..

అధికారంలోకి వచ్చాక అందరి బాధ్యత తీసుకుంటా. నేతన్నల కోసం టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తా. చేనేత కార్మికులకు కేటగిరీని బట్టి 200 నుంచి 500 వరకు ఉచిత విద్యుత్ అందిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు సెంట్లులో ఇళ్లు కట్టిస్తాం. ఇంకొల్లుతో పాటు ముస్లిం సోదరులున్న చోట ఆటోనగర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం. గండ్లకమ్మ మరమ్మతులు చేపడతాం. పర్యాటకంగా బీచ్‌లను అభివృద్ధి చేస్తాం. గ్రానైట్ పరిశ్రమకు పూర్వవైభవం తెస్తాం. గుంటూరు ఛానల్ పొడిగింపు చేస్తాం. సాకి, ఆలేరు, రొంపేరుల పనులుతో పాటు, గోదావరి జలాలు సాగర్ రైట్ కెనాల్‌కు తరలింపు, కొమ్మమూరు కాలువ పనులు చేపడతాం. విదేశీ విద్య, పండుగ కానుకలు, అన్నా క్యాంటీన్‌లు కొనసాగుతాయి.

వైసీపీ సభకు రైట్ రైట్



- అనంత బాటలో ఆర్టీసీ బస్సులు
- డిపోల్లో ప్రయాణికుల పడిగాపులు
- బస్సులు కొరతతో ప్రయాణాలకు పాట్లు



బస్సుల కోసం నరసరావుపేట బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు

గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, ఫిబ్రవరి 17: వైసీపీ సేవకు ఆర్టీసీ సిద్ధమవగా.. ప్రయాణికులు గమ్య స్థానాలకు చేరుకునేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అనంతపురంలో అధికార వైసీపీ సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా పరిధిలోని డిపోల నుంచి బస్సులను తరలించారు. దీంతో డిపోల్లో బస్సులు లేక.. సామాన్యులు ప్రయాణాలకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. డిపోల్లో కండీషన్‌లో ఉన్న బస్సుల్లో సగానికిపైగా అనంతపురంలో జరిగే వైసీపీ సభకు కేటాయించారు. దీంతో శనివారం ఉదయమే ఆయా బస్సులు అనంతపురానికి తరలివెళ్లాయి. బస్సులు అనంతపురం సభకు వెళ్లడంతో బస్టాండ్‌లు ఖాళీ ప్లాట్ ఫామ్‌లతో వెలవెలబోయాయి. సీఎం జగన్ నిర్వహించే సభ కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా నుం చి 292 సర్వీసులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విభజిత గుంటూరు జిల్లాలోని డిపోలతో పాటు పల్నాడులోని ఆరు డిపోలు, బాపట్ల జిల్లా నుంచి బస్సులను కూడా తర లించారు. వివిధ అవసరాల కోసం రాకపోకలు సాగించే ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్లలో పడిగాపులు కాయాల్సివచ్చింది. మరోవైపు ఉద్యోగులు నిర్ణీత సమయానికి కార్యాలయాలకు వెళ్లేందుకు బస్సులు సకాలంలో లేక నరకయాతన పడ్డారు. గుంటూరు నుంచి బాపట్ల, పొన్నూరు, విజయవాడ వైపునకు, పల్నాడు, పర్చూరు రూట్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పల్లెవెలుగు రూట్లలో నరకయాతన..

పల్లెవెలుగు రూట్లలో అరకొరగా సర్వీసులు ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడాల్సి వచ్చింది. అమరావతి, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తుళ్లూరు, పర్చూరు, తెనాలి, నరసరావుపేట, చిలకలూరిపేట రూట్లలో వెళ్లే పల్లె వెలుగు సర్వీసులను ఏర్పాటు చేయలేకపోయారు. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అరకొర బస్సులు కిటకిటలాడాయి. దీంతో ప్రయాణికులు ప్రత్యక్ష నరకం చవి చూశారు. ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. ఆర్టీసీ బస్సులను అనంతపురం సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని మండిపడ్డారు. వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి మండలాల పరిధిలో రాత్రి పూట హాల్టింగ్ బస్సులను పూర్తిగా రద్దు చేసి, వాటిని అనంతపురం జిల్లా రాప్తాడుకు తరలించారు. వినుకొండ డిపోలో 60 బస్సులు ఉండగా వాటిలో 40 బస్సులు అనంతపురం జిల్లాకు తరలించడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట డిపో నుంచి 23 బస్సులను అనంతపురానికి పంపించారు. గుంటూరు, చీరాల, మాచర్ల తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు తగ్గి పోవటంతో ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. ఆది, సోమవారాల్లో కూడా బస్సులు ఉండవని సామాన్యులు ప్రయాణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

మైనింగ్ వీరప్పన్.. మహేష్‌రెడ్డి

- అక్రమంగా కాజేసినదంతా కక్కిస్తాం
- మాడుగుల పర్యటనలో యరపతినేని



తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న యరపతినేని

గురజాలటౌన్, ఫిబ్రవరి 17: మైనింగ్ మాఫియా వీరప్పన్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అని, స్తంభాలబోడును మరో కేజీఎఫ్‌గా మార్చారని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మండలంలోని మాడుగుల శివారులో స్తంభాలబోడును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మాడుగులలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయగా, 2014-2019లో గ్రామాన్ని దత్తత తీసుకుని తాగునీరు, సీసీ రోడ్లు తదితర వసతులతోపాటు పాఠశాలను నిర్మించామన్నారు. తాను వేల కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తే మహేష్‌రెడ్డి ఖనిజ సంపదను దోచుకుని అక్రమ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. రంగు రాళ్ల వాటాల్లో తేడాలతో బ్రహ్మయ్య అనే వ్యక్తిని హత్య చేశారన్నారు. మాడుగుల శివారులోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వైసీపీ నేతలు సాగుభూములుగా చేసుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని, వారి అక్రమార్జనను కక్కిస్తామన్నారు. జైనులు, బౌద్ధులు ప్రార్థనలు జరుపుకునే స్థూపం కిందపడి పగిలిపోయి ఉండడాన్ని పరిశీలించారు. తాను పర్యాటకంగా అభివృద్ధి చేద్దామని ప్రతిపాదనలు పంపిన ప్రాంతం రూపురేఖలు కోల్పోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యరపతినేని వస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రికి రాత్రే అధికార పార్టీ నేతలు స్తంబాలబోడుపై తవ్వకాలను నిలిపివేసి, ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లను తరలించేశారు. యరపతినేని వెంట టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మాజీ జడ్పీటీసీ గనిపల్లి శ్యాం, యాగంటి రామారావు, యేచూరి బ్రహ్మయ్య, చావా రామారావు, మాగంటి సుబ్బయ్య, మద్దినేని లక్ష్మీనారాయణ, నన్నపనేని లక్ష్మయ్య, బత్తుల సైదారావు, నాగరాజు తదితరులు ఉన్నారు.



క్వారీలో గ్రామస్థులతో పర్యటిస్తూ..

దిక్సూచి DIKSUCHI



ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ అంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీ

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్



చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటి కోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలల పాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటోమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8yMEdJCలో చదవండి.

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు



విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్... అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత) (ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి

పరీక్ష ఫీజు: రూ.250


రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

నవ్య | చిత్రజ్యోతి

శివరాత్రికి సిద్ధం



గోపీచంద్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' మహా శివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. 'మరో ఇరవై రోజుల్లో.. 'అని పేర్కొంటూ శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైటింగ్‌కు సిద్ధం అన్నట్లు పోలీస్ యూనిఫామ్‌లో గోపీచంద్ కవ్విస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు.

మున్నార్‌లో ముగించారు



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం మున్నార్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌లో చిత్రబృందం పాల్గొనగా కీలకఘట్టాలను తెరకెక్కించారు. టాకీపార్ట్‌తో పాటు నితిన్, ఫైటర్స్‌పై భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ తెలిపింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

అమరన్‌గా శివ కార్తికేయన్



తమిళ హీరో శివ కార్తికేయన్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న చిత్రానికి 'అమరన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం శివ కార్తికేయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఆర్మీ మేజర్ ముకుందవరదరాజన్ జీవితం ఆధారంగా రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్ లెస్' సిరీస్‌లోని ఓ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి

గ్రామీణ ప్రేమకథ



ప్రేమకు అర్థం చెబుతూ రూపొందిన 'రాధా మాధవం' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించారు. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ ఈ సినిమాను నిర్మించారు. 'మా సినిమా సెన్సార్ పూర్తయింది. గ్రామీణ నేపథ్యంలో నిర్మించిన చక్కని సందేశాత్మక చిత్రమని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్, టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వచ్చింది. సినిమాపై నమ్మకం పెరిగింది. మార్చి ఒకటిన ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు నిర్మాత. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించిన ఈ చిత్రానికి సతీశ్ లైన్ ప్రొడ్యూసర్

ఒకే పాత్ర.. సామాజిక సందేశం



ఒకే పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. భరత్ పారేపల్లి దర్శకత్వంలో డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు నటిస్తూ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత సాంబేష్ మాట్లాడుతూ 'మంచి సినిమాలు చేయాలని శ్రీధర్ రాజు పరిశ్రమకు వచ్చారు. మొదటి 'మేరా భారత్ మహాన్' సినిమా తీశారు. ఇప్పుడు ఒకే పాత్రతో 'నేటి భారతం' తీశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఈ సినిమా ద్వారా చూపించాం' అని చెప్పారు. కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఈ సినిమా ఉంటుందని నిర్మాత, నటుడు శ్రీధర్ రాజు చెప్పారు. ఇందులో తను జర్నలిస్ట్ పాత్రను పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టు అంకిత భావం, తెగింపు ఇందులో చూపించామని చెప్పారు.

టీనేజ్ లవ్ స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రూపుదిద్దుకున్న చిత్రం 'మధురం2. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దర్శకుడు చిత్రం గురించి వివరిస్తూ '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, ఎలా ఉండేవో చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత బంగార్రాజు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమా కూడా కొత్తగా, నేటి తరానికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. హైదరాబాద్, పాలకొల్లు, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం , కోనసీమ ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

అరుదైన వ్యాధితో 'దంగల్' నటి మరణం





ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్'(2016)లో బబిత పాత్రలో నటించిన బాలనటి సుహానీ భట్నాగర్ అరుదైన వ్యాధితో శుక్రవారం కన్ను మూసింది. ఆమె వయసు 19 ఏళ్లు. సుహానీ డెర్మటోమయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. స్టెరాయిడ్స్ ఇవ్వడమే దీనికి చికిత్స. కండరాలను బలహీన పరచడం, శరీరంపై రాష్ రావడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి తగ్గడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వారి సూచన మేరకు స్టెరాయిడ్స్ తీసుకున్నా, ఆమె లేత శరీరం దానికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు ఇన్‌ఫెక్షన్ వచ్చి , లంగ్స్‌లోకి నీరు చేరడంతో సుహానికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. అలా బాధ పడుతూనే చివరకు శుక్రవారం సాయంత్రం ఆమె కన్ను మూసిందని సుహానీ తండ్రి పునీత్ సజల నయనాలతో చెప్పారు. 'దంగల్'లో నటించిన తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్‌లో సుహాని నటించింది. 2019లో ఆమె నటనకు దూరం జరిగి చదువు మీద దృష్టి పెట్టింది. ప్రస్తుతం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చదువుతోంది. సోషల్ మీడియాకు దూరంగా ఉండే సుహాని చదువు పూర్తయ్యాక మళ్లీ సినిమాల్లో నటించాలనుకుందనీ, అంతలోనే ఇలా జరగడం చూసి తట్టుకోలేక పోతున్నామని ఆమె తల్లి పూజ చెబుతూ ఎమోషనల్ అయ్యారు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

జగన్ దిగిపోతేనే రాష్ట్రానికి మేలు

● 1,523వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 17: జగన్‌రెడ్డి దిగిపోతేనే రాజధాని అమరావతికి మేలు జరిగి రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని 33వేల ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శనివారం నాటికి 1,523వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడారు. ఎక్కడా అభివృద్ధి చేయకుండా జనానికి సంక్షేమ పథకాలని పప్పుబెల్లాలు పంచి, అందినకాడికి వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఇరవై సంవత్సరాలు వెనకబాటుకు గురి చేశారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారన్నారు. అందుకే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతి అభివృద్ధిని కొనసాగించమని తీర్పు చెప్పిందన్నారు. అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి విరాజిల్లుతుందన్నారు. కాని సీఎం జగన్‌రెడ్డి అమరావతి నాశనం కోరుకోవటంతో రాష్ట్రాభివృద్ధి అగమ్యగోచరమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి తాడికొండ నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

దాడి చేసినవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు

● గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా ఉంది

● టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: జంగమేశ్వరపాడులో జరిగిన దాడిలో గాయపడిన ఇరువురు పరిస్థితి దారుణంగా, ఉందని టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. శనివారం మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం జంగమేశ్వరపాడులో వైసీపీ దాడిలో గాయపడి నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను టీడీపీ నియమించి త్రీమెన్ కమిటీ సందర్శించి పరామర్శించింది. ఈ కమిటీలో బాలాజీతో పాటు టీడీపీ రాష్ట్ర టీడీపీ యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీడీపీ బీసీ సెల్ జోనల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏవరైతే దాడి చేశారో వాళ్ళమీద కేసులు లేవని, వారంతా స్వేచ్ఛగా తిరుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే రాజకీయ స్వలాభం కోసం బలహీన వర్గాల మధ్య కక్షలు పెంచారని ఆరోపించారు. గతంలో జల్లయ్య అనే అతనిని చంపేశారని, ఎవరైతే జల్లయ్యను హత్యచేశారో వాళ్ళే మళ్ళీ జంగమేశ్వరపాడులో దాడి చేశారని అన్నారు. ఎస్పీ శాంతి, భద్రతలను ఎందుకు అదుపు చేయలేకపోతున్నారని నిలదీశారు. ఎమ్మెల్యే, ఆయన తమ్ముడి ఇంట్లో శుభకార్యక్రమం జరిగితే బలహీనవర్గాల మీద దాడి చేసి రక్తం కళ్ళ చూడటం ఒక రాక్షస క్రీడన్నారు. ఈ రాక్షస క్రీడకు త్వరలోనే చరమగీతం పాడతామన్నారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించడానికి కూడా బంధువులు, మహిళలు భయపడి పోతున్నారని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నరసరావుపేట నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి, దుర్మార్గాలు ఎక్కువ అయ్యాయన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ వచ్చిన తర్వాత క్రైమ్ రేటు పెరిగిందన్నారు. బాధితులకు పోలీసులు, కలెక్టర్ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, రాంబాబు, బాధిత గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పల్నాటి ప్రజలే ముందుండి నడిపించారు..

● అందరి మన్ననలు పొందడానికి అవకాశం ఇచ్చింది వారే..

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: అందరి మన్ననలు పొందడానికి కారణం పల్నాటి ప్రజలేనని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శనివారం నరసరావుపేట ఎన్జీవో కాలనీ ఎంపీ కార్యాలయంలో నరసరావుపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంపీతో సమావేశమై సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభిమానించిన వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. పల్నాటి ప్రజలు తప్పు చేస్తే ముఖంమీద చెప్పే వ్యక్తులేనని అన్నారు. మంచిపేరు సంపాదించుకోవడానికి కారణం ఇక్కడ ఉన్న ప్రజలేనని ప్రశంసించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు అనుమతులు అన్ని తీసుకురావడం జరిగిందన్నారు. పనులు ప్రారంభమైతే ఏడాదిలో పూర్తి అవుతుందన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ స్థిరీకరణ గురించి ఆలోచిస్తున్నానని అన్నారు. వర్షాలు దండిగా పడితే కుడికాలువకు నీరు వస్తుందని, గోదావరి, కృష్ణ అనుసంధానం జరిగితేనే సమస్య పరిష్కారం అవుతుందని, వచ్చే ఐదు సంవత్సరాల్లో అది సాధించేలా కృషి చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం పీఎంసీ పథకంతో ముందుకువచ్చిందని, కేంద్రీయ విద్యాలయం స్థాయిలో ఉండే పీఎంసీ స్కూల్ ప్రతి మండలంలో ఉండే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఉండాలన్నారు. ఇక్కడ ఉన్న యువతకు టెక్స్‌టైల్స్, లేదా మిర్చికి సంబంధించి సెజ్ ఏర్పాటు చేస్తే ఉపాధి కల్పించిన వారం అవుతామన్నారు. టెక్స్‌టైల్స్ మిర్చికి సంబంధించిన సెజ్ కేంద్రప్రభుత్వం ద్వారా సాధించుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే ఐదు సంవత్సరాల్లో అది సాధించే దిశగా పనిచేస్తామన్నారు. తటస్థులుగా ఉండే వ్యాపారులు ప్రజలను చైతన్యపరిచి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు మాజేటి వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, వనమా శివ, వ్యాపారులు పాల్గొన్నారు.

మిగిలింది డొక్కు బస్సులే..

● జీటీ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

● మరో బస్సు కోసం ప్రయాణీకుల పడిగాపులు

గుంటూరు, ఫిబ్రవరి 17: అసలే సగం డొక్కు బస్సులు.. అందులో కండిషన్‌లో ఉన్న సర్వీసులను సీఎం సభకు తరలించారు. మిగిలిన బస్సులు మొరాయిస్తూ మార్గమధ్యలోనే నిలిచిపోతున్నాయి. శనివారం రాత్రి పది గంటల సమయంలో గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ సెంటర్‌లో ఆగిపోయింది. సాంకేతిక లోపంతో నిలిచిన బస్సును బాగుచేసేందుకు సిబ్బంది విశ్వప్రయత్నాలు చేసి గుంటూరులోని అధికారులకు సమాచారం అందించారు. మరొక సర్వీసు పంపించాలని కోరారు. మరొక బస్సు వచ్చే వరకు ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సివచ్చింది. నగరంలో నిలిచిపోయింది కాబట్టి సరిపోయింది ఎక్కడో జాతీయ రహదారి మధ్యలో నిలిచిపోతే పరిస్థితి ఏంటంటూ ప్రయాణీకులు వాపోయారు. అనంతపురంలో ఈ నెల 18న సీఎం జగన్ నిర్వహించే సిద్ధం సభకు ఉమ్మడి జిల్లా నుంచి 292 సర్వీసులు తరలించారు. విభజిత జిల్లాల నుంచి సగం సర్వీసులను సీఎం సభకు తరలించారు. అందునా కండిషన్‌లో ఉన్న సర్వీసులను తరలించి డొక్కు బస్సులను ప్రయాణీకులకు వదిలేశారు. మార్గమధ్యంలోనే డొక్కు బస్సులు మొరాయిస్తున్నాయి. పల్నాడు ప్రాంతానికి వెళ్ళేందుకు అనేకమంది ప్రయాణీకులు గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని పల్నాడు బస్టాప్‌లో అర్ధరాత్రి వరకు బస్సుల కోసం పడిగాపులు కాశారు.

నేటి నుంచి రిలే దీక్షలు.. అటుపై సమ్మెలోకి..

● వీఆర్‌ఏ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న కే ఉమామహేశ్వరరావు, పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17: విజయవాడ ధర్నా చౌక్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రిలేదీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె. ఉమామహేశ్వరావు పిలుపునిచ్చారు. స్థానిక బ్రాడీపేటలో సీఐటీయూ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేల్, 2018నుంచి రికవరీ చేసిన డీఏ బకాయిలు తిరిగి చెల్లింపులు, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించడం, అర్హులైనవారికి పదోన్నతి తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికలకు ముందు విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన వీఆర్‌ఏల ధర్నా శిబిరానికి సీఎం జగన్‌మోహనరెడ్డి హాజరై మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వీఆర్‌ఏల జీతం రూ.15000కు పెంచుతామని చెప్పి, ఇప్పుడు మాత్రం 2018 నుంచి రూ.300 చొప్పున డీఏని జీతాల నుంచి సుమారు రూ.15వేలు ప్రభుత్వం రికవరీ చేసిందని గుర్తుచేశారు. సమస్యలపై పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకో వడం లేదని పేర్కొన్నారు. రెండు రోజులు పాటు జరిగే దీక్షలకు దిగిరాకపోతే, ఈనెల 20 తరువాత ఏ రోజునైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. సమావేశంలో యూని యన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్, కోశాధికారి వడ్డే బాజీబాబు, జిల్లా నాయకులు బీ లక్ష్మణరావు, బీ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

25న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కొల్లూరు, ఫిబ్రవరి 17: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సీనియర్స్ పురుషుల జట్టు ఎంపికను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి.నెల్లిరెడ్డి శనివారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరిగే ఎంపికల్లో జిల్లా జట్టుకు ఎంపికైనవారు మార్చి 8, 9, 10 తేదీలలో నెల్లూరు జిల్లా కొవ్వూరులో జరిగే 70వ అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 25వ తేదీన ఉదయం 9 గంటలకు బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. క్రీడాకారులు 85 కిలోల బరువు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 99893 48699, 94902 74746 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు, ఫిబ్రవరి 17: స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరులో గల శ్రీతిరుమల అయ్యప్ప రియల్ ఎస్టేట్ ప్లాట్‌లలో నల్లచెరువుకు చెందిన కలవ నాగపూజను హత్యచేసిన కేసులో నిందితుడైన రేటూరి నాగరాజును నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలు ఉపయోగించి ఆమెను హత్య చేసిన విషయం విదితమే. దీనిపై నల్లపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి సదరు కేసులోని నిందితుడైన కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన రేటూరి నాగరాజుని అదుపులోకి తీసుకున్నారు. అతడు, నాగపూజను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. నాగపూజపై అనుమానంతో ఈ హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని సీఐ రాంబాబు తెలిపారు. కాగా నిందితుడు నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి




నాగరాజు మృతదేహం

చేబ్రోలు, ఫిబ్రవరి 17: చేబ్రోలు మండల శివారులో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి చెందిన బుర్రి నాగరాజు ప్రైవేటు బ్యాంక్‌లో పని చేస్తూ విధులు ముగించుకొన్ని ఇంటికి బయల్దేరాడు. నారాకోడూరు గ్రామం నుంచి లేమల్లెపాడు గ్రామం రోడ్డులో ఓ మహిళను ఢీకొని ద్విచక్ర వాహనం పైనుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో బుర్రి నాగరాజు (33) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన మహిళను చికిత్స నిమ్మిత్తం గుంటూరు తరలించారు. ఈ ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కృష్ణానదిలో ఈతకు దిగి వ్యక్తి...

తాడేపల్లి, ఫిబ్రవరి 17: తాడేపల్లి మండలం ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు ఎత్తిపోతల ప్రాంతంలో శనివారం ఓ వ్యక్తి ఈతకు దిగి ప్రాణాలు కోల్పోయాడు. విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కుంచే లోకేశ్ (27) భార్య, ఇద్దరు పిల్లలతో శనివారం సాయంత్రం నది వద్దకు వచ్చి స్నానానికి దిగారు. పిల్లలకు స్నానం చేయించిన అనంతరం లోకేశ్ కొద్దిసేపు నీటిలోనే ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. లోకేశ్ బయటకు రాకపోవడంతో భార్య కమలకుమారి స్థానిక మత్స్యకారులకు విషయం తెలిపింది. అనంతరం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మృతుడు బజాజ్ క్యాపిటల్‌లో పని చేస్తాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా - ఒకరు...



చిన దానియేలు మృతదేహం

వెల్దుర్తి, ఫిబ్రవరి 17: అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కండ్లకుంటలో జరిగింది. మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన దానియేలు (45) పశువుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం కండ్లకుంటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కాడు. గ్రామం దాటగానే ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం దేవరకొండకు చెందిన శాంతితోపాటు మరో మహిళ గాయపడ్డారు. వీరిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా చినదానియేలు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శాంతి, మరో మహిళ చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చిన దానియేలు భౌతికకాయాన్ని సందర్శించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.20వేలను అందించారు.

చంద్రబాబుది సంక్షేమం.. జగన్‌రెడ్డిది శాడిజం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



టీ స్టాల్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 17: ముఖ్యమంత్రులుగా చంద్రబాబుది సంక్షేమం అయితే జగన్‌రెడ్డిది శాడిజం అనే విషయం ఈ ఐదు సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వచ్చిందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అందుకే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా?, ఆ సైకోరెడ్డి ఎగ్జిట్ బటన్ నొక్కి ఎప్పుడు విముక్తి పొందుదామా? అని ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. అందుకే జగన్ ఇప్పుడు ఓటమి సంకేతాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేయటం, బెదిరించటం పై దృష్టి పెట్టినట్టు కన్పిస్తుందన్నారు. జగన్ ఓడిపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నది పచ్చి అబద్ధమన్నారు. సంక్షేమ పథకాలు జగన్ రాక ముందు కూడా ఉన్నాయి. జగన్ పోయిన తరువాత కూడా కొనసాగుతాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని కృష్ణమహల్ రోడ్డులో టీ దుకాణం వద్ద ఆగిన ప్రత్తిపాటి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి టీ తాగారు. టీడీపీ అధికారంలోకి వస్తే అంతా మంచి జరుగుతుందని ప్రత్తిపాటి వారికి భరోసా ఇచ్చారు. మరింత సంక్షేమం దిశగా చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారని, సూపర్ - 6 పథకాల రూపంలో ఈ నమూనాలను ఇప్పటికే ప్రజల ముందు పెట్టారని ఆయన గుర్తు చేశారు.

పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో దాడి

● అర్ధరాత్రి టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ మూకల దాష్టీకం

● అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపైనా..

పెదనందిపాడు, ఫిబ్రవరి 17: సోషల్ మీడియాలో వైసీపీకి వ్యతిరేకంగా పోస్టింగ్‌లు పెడుతున్నాడనే అక్కసుతో వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని కొప్పర్రులో చోటు చేసుకుంది. కొప్పర్రుకు చెందిన షేక్ జానీబాషా(ఫోటోగ్రాఫర్) పెదనందిపాడులో ఓ ఫంక్షనుకు వెళ్తుండగా అదే సమయంలో బీసీ కాలనీ వద్ద ఫ్లెక్సీలు కట్టేందుకు సిద్ధంగా ఉన్న వైసీపీ నాయకులు ఫ్లెక్సీని కావాలనే అతనిపై విసిరేశారు. జానీబాషా ఎందుకు వేశారు అని ప్రశ్నించగా వారు దుర్భాషలాడారు. దీంతో కుటుంబసభ్యులు కలుగజేసుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. జానీ బాషా తండ్రి మస్తాన్‌వలిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి దాడికి గల వివరాలు సేకరించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

సబ్ జైలు ఖైదీల తరలింపు

తెనాలి క్రైం, ఫిబ్రవరి 17: సబ్ జైలు ఖైదీలను తరలించినట్లు జైలు సూపరింటెండెంట్ కృష్ణారావు శనివారం తెలిపారు. ఇక్కడ ఉన్న 36మంది ఖైదీలలో ముగ్గురు మహిళా ఖైదీలను గుంటూరు సబ్ జైలుకు, 10మంది ఖైదీలను బాపట్ల సబ్ జైలుకు, 23 మంది ఖైదీలను రేపల్లె సబ్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. తెనాలి సబ్‌జైలు 100 సంవత్సరాల పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన సబ్‌జైలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ స్థానంలో నూతన సబ్‌జైలు నిర్మాణానికిగాను ఖైదీలను తరలించి త్వరలో నిర్మాణపనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

పల్నాడు వార్తలు

మాచర్ల • గురజాల • సత్తెనపల్లి • పెదకూరపాడు



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

మైనార్టీలను చైర్మన్ చేసిన ఘనత టీడీపీదే

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 17 : మాచర్లలో ముస్లిం మైనార్టీ అయిన చత్తు సాహెబ్‌ను మున్సిపల్ చైర్మన్ చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. వైసీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ మదార్‌సాహెబ్, మోసిన్ ఆధ్వర్యాన 60 ముస్లిం మైనార్టీ కుటుంబాలు శనివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్లలో కులమతాలకు అతీతంగా ప్రజలంతా కలిసి ఉంటారని, తన తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మైనార్టీల అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించారని, షాదీఖానా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాలను వేధింపులకు గురి చేస్తున్న వైసీపీని ఇంటికి పంపాలన్నారు. వైసీపీ నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందేందుకు అందరూ కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, పఠాన్ బాబుఖాన్, పేరువాళ్ల పుల్లారావు, మాచర్ల వాసు, బొల్లెద్దుల బాబు, ప్రకాష్, కంభంపాటి బాబు, నాగూర్‌బాషా, మస్తాన్, ఖాజా, జబ్బార్, గోగుల సీతారెడ్డి, పంగులూరి అంజయ్య, పుల్లయ్య, చప్పిడి రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు బీసీలు ఐక్యంగా పనిచేయాలి

● టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు గుంటుపల్లి

దాచేపల్లి, ఫిబ్రవరి 17: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు బడుగు, బల హీన వర్గాల ప్రజ లంతా ఐక్యంగా ఉండి పనిచేయాలని టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం గుంటుపల్లి నాగేశ్వరరావు గృహంలో మండల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు, ఇతర పార్టీ పెద్దలు సమావేశమయ్యారు. గుంటుపల్లి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బడుగు, బలహీనవర్గాలను అణగదొక్కేందుకు శతవిధాల ప్రయత్నం చేసిందని ఆరోపించారు. బీసీలకు రాజ్యాధికారం దక్కకుండా రిజర్వేషన్లను తగ్గించారని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌లను నియమించి ఎటువంటి నిధులు లేకుండా చేశారని విమర్శించారు. అనంతరం గుంటుపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, రుద్రాల అచ్చారావు, బత్తుల రాంబాబు, కల్లూరి రాఘవ, కమతం వెంకటరావు, తిరుమలశెట్టి ఆంజనేయులు, ముంద్ర రామారావు, చిలుముల దుర్గారావు, వేళంగిరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ర్యాలీ



పిడుగురాళ్లలో ర్యాలీ చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి, ఏపీ జేఏసీ పిలుపు మేరకు శనివారం పిడుగురాళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు స్థానిక జడ్పీ పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డీఏ, పీఆర్సీ బకాయిలు, పెండింగ్ జీపీఎఫ్, మరికొన్ని రుణాలను వెంటనే మంజూరు చేయాలని, తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని జేఏసీ చైర్మన్ డి.పట్టాభి, యూటీఎఫ్ నాయకులు విజయసారథి, ఏపీ ఎన్‌జీఓ కార్యదర్శి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మన్నవ సాగర్‌బాబు, కొత్త వెంకట చలపతిరావు, శేషగిరిరావు, యూటీఎఫ్ అధ్యక్షుడు సాంబశివరావు, గోసు ప్రసాద్, కారసాల విజయబాబు, భారతి, రామలింగయ్య, శ్రీనివాసరావు, సత్యనారాయణరాజు, సాయిబాబా, వర్ల రామగురవమ్మ, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



సత్తెనపల్లిలో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జేఏసీ నాయకులు

● సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన 12వ పీఆర్‌సీ మధ్యంతర భృతిని తక్షణమే 30 శాతం చెల్లించాలని ఏపీ జేఏసీ సత్తెనపల్లి శాఖ చైర్మన్ పెండెం మణిరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ప్రదర్శన చేశారు. అనంతరం తాలూకా సెంటర్‌లో జరిగిన సభలో మణిరావు, పలువురు నేతలు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మక్కెన శ్రీనివాసరావు, రెహ్మాన్, శివారెడ్డి, కందిపోగు అంబేద్కర్, అగస్టస్ బాబు, విష్ణు వర్దన్, ఠాగూర్, నాగేశ్వరరావు, దుర్గారావు, సందెపోగు శ్రీనివాసరావు, నెట్టెం సాంబశివరావు, చిలకా ప్రదీప్, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, ఫిబ్రవరి 17 : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడు డీడీ నాయక్, అమరావతి జేఏసీ కార్యదర్శి నాగేశ్వరరావు, పూర్ణయ్య, వెంకటాద్రి, ఎం.సాంబశివరావు, మరియదాసు, అరుణ్‌రావు, జి.కోటేశ్వరరావు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● రాజుపాలెం, ఫిబ్రవరి 17 : రాజుపాలెం గ్రామంలో ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గుంటూరు-మాచర్ల రహదారి వరకు ఈ ర్యాలీ చేశారు. ర్యాలీలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ తాలుకా ప్రెసిడెంట్ షేక్ ఆర్‌పి.బాషా మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు, కొత్త పీఆర్సీ, ఐఆర్ ప్రకటనపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహేష్, కోటేశ్వరరావు, భాను ఉన్నారు.

హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జనసేన నేతలు

మాచర్ల, ఫిబ్రవరి 17 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈనెలాఖరున మాచర్లలో పర్యటించనుండడంతో ఆ పార్టీ నేతలు హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలాన్ని శనివారం పరిశీలించారు. సెయింట్ ఆన్స్ స్కూల్ హెలిప్యాడ్ ల్యాండు అవుతుందని, అంబేద్కర్ సెంటర్లో సభ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, ఎలక్షన్ సెంట్రల్ కోకన్వీనర్లు పెంట్యాల బాలాజీ, నిస్సంకరరావు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పులి హరి, సమన్వయకర్త బూసా రామాంజనేయులు, గుండెబోయిన సాంబశివరావు, గంధం మల్లయ్య, తోటకూర శ్రీనివాసరావు, కేశానుపల్లి కృష్ణబాబు, రుద్రాల రవి, కొప్పుల రమణ, లాల్‌కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బంగారు భవిష్యత్తు

● వైసీపీని బంగాళాఖాతంలో కలపండి

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీలో యరపతినేని

గురజాలటౌన్, ఫిబ్రవరి 17 : టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బంగారుమయమవుతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మాడుగులలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. యరపతినేని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే భవిష్యత్తు గ్యారంటీలో వాగ్ధానాలను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేస్తామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచక పాలన సాగుతుందన్నారు. ప్రజలంతా ఏకమై వైసీపీని బంగాళఖాతంలో కలపాలన్నారు. టీడీపీ హయాంలో తాను మాడుగులను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తే ఇప్పుడు గ్రామంలో ఏం జరుగుతుందో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

గ్రామంలో యరపతినేని ఇంటింటికి తిరుగుతూ పెద్దలు, వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. వృద్ధులను అక్కున చేర్చుకొని ఎలా ఉన్నారు.. తిన్నారా.. ఆరోగ్యం బాగుంటుందా అంటూ కుటుంబవ్యక్తిలా పలుకరించారు. యరపతినేని చూపిస్తున్న



కరపత్రాలు అందజేస్తున్న యరపతినేని

ఆప్యాయతకు అవ్వ, తాతలు బావోద్వేగానికి లోనయ్యారు. శీనయ్య.. నిన్ను గెలిపించుకుంటామయ్యా అంటూ చేతిలో చేయేశారు. యరపతినేని వెంట టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పులుకూరి కాంతారావు, మాజీ జడ్పీటీసీ గనిపల్లి శ్యాం, యాగంటి రామారావు, యేచూరి బ్రహ్మయ్య, చావా రామారావు, మాగంటి సుబ్బయ్య, మద్దినేని లక్ష్మీనారాయణ, నన్నపునేని లక్ష్మయ్య, బత్తుల సైదారావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజి నగదు స్వాహా

● సుమారు 4.50 లక్షల నగదు కాజేసిన వీవోఏ

మాచవరం, ఫిబ్రవరి 17: అమాయకులైన చదువురాని డ్వాక్రా మహిళలను మాయచేసి సుమారు రూ.4.50 లక్షలు స్వాహా చేసిన తురకపాలెం వీవోఏ అల్లావలి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచవరం మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన పది మంది మహిళలు అల్లా మహిళా పొదుపు గ్రూపు పేరు మీద మాచవరం ఇండియన్ బ్యాంక్‌లో ఖాతా తెరిచి పొదుపు చేసుకుంటూ వచ్చారు. బ్యాంక్ మేనేజర్ వారి పొదుపును చూసి వారికి బ్యాంక్ లింకేజి కింద కొంత రుణాన్ని ఇచ్చారు. అయితే సదరు రుణం నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించకపోవడంతో శనివారం బ్యాంక్ మేనేజర్ సంబంధిత అధికారిని పిలిపించి ప్రశ్నించారు. సదరు అధికారి తురకపాలెం గ్రామానికి వెళ్లి విచారించగా గ్రామానికి చెందిన వీవోఏ అల్లావలి మహిళల వద్ద నెలవారీ వసూలు చేసి అప్పు ఖాతాలో జమచేయకుండా తమ జేబులో వేసుకున్నట్లు రుజువైంది. సుమారు రూ.లక్ష వరకు ఈ ఒక్క గ్రూపులోనే స్వాహా చేశాడని బట్టబయలైంది. స్త్రీ నిధి కింద సుమారు రూ.లక్షన్నర కూడా అప్పుకింద జమవేయలేదని మహిళలు ఆరోపించారు. మరో గ్రూపునకు సంబంధించి సుమారు రూ.3 లక్షల రూపాయల వరకు స్వాహా చేశాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పు ఖాతాలో ఇచ్చిన డబ్బు జమ కాకపోవడంతో డ్వాక్రా మహిళలు ఆవేదన చెందుతూ బోరున విలపిస్తున్నారు. తురకపాలేనికి చెందిన అల్లా మహిళా పొదుపు గ్రూపునకు సంబంధించి వీవోఏ చేసిన అక్రమాలు తమ దృష్టికి వచ్చాయని, అతని ద్వారానే పక్కదారి పట్టిన నగదును రికవరీ చేయించి అల్లా పొదుపు గ్రూపు అప్పు ఖాతాలో జమచేయిస్తామని ఏపీఎం సురేష్ తెలిపారు. సోమవారం డ్వాక్రా గ్రూపు మహిళలచే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయిస్తామని తెలిపారు.

25న బీసీ గర్జన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 : పిడుగురాళ్లలో ఈ నెల 25న జరుగనున్న బీసీగర్జన బహిరంగసభను గురజాల నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గ నేతలందరూ పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని గురజాల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొక్కెర కొండలు, పట్టణ అధ్యక్షుడు యరగాని కొండలు, దూదేకుల ఖాశింసైదాలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ సమావేశానికి రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు, కుమ్మరి క్రాంతికుమార్, బాదుగున్నల శ్రీను, యామా మురళీ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో డీవీ స్వామి, చింతల అజయ్‌కుమార్, దూదేకుల సలీం, మస్తాన్, దాసరి నాగరాజు, నలబోతుల గాలయ్య, కుంచపు నాగలింగేశ్వరరావు, డాక్టర్ వెంకయ్య, సైదా, యలగాల రామారావు, కర్పూరపు కోటేశ్వరరావు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభకు ఆహ్వానితుడిగా నాగేశ్వరరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 17 : ఆర్యవైశ్య మహాసభకు ప్రత్యేక ఆహ్వానితుడిగా పట్టణానికి చెందిన వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ నుంచి వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావుకు మహాసభకు ఆహ్వానితుడిగా నియామకపత్రాన్ని పంపించారు. నాగేశ్వరరావు ఎంపికపై పట్టణ బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తకోటి హనుమంతరావు, భవనాశి నరసింహారావు, షేక్ బాబావలి, తాన్న కోటేశ్వరరావు, కమలాకర్, రమణ, కొత్త వెంకటేష్, బ్యాంక్ సర్వేశ్వరరావు, సత్యానందమూర్తి అభినందనలు తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి : డేగల రవి

రెంటచింతల,ఫిబ్రవరి 17 : పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, పత్రికా విలేకరులపై దాడులు అరికట్టాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్, టీడీపీ నేతలు, జర్నలిస్టులు రెంటచింతల పురవీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అమరావతి విలేకరి పరమేశ్వరరావుపై జరిగిన దాడి యావత్ సమాజంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. డిప్యూటీ తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిని అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రంగనాయకులు, టీడీపీ మాజీ ఉప ఎంపీపీ ఊదేనాయక్, సత్రశాల ట్రస్ట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు నీలం మల్లయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నేత జి.శ్రీనివాసరావు, సీనియర్ కమ్యూనిస్టు నేత మరియదాసు, జర్నలిస్టు నేతలైన అల్లరాజు, ఓరుగంటి వెంకటేశ్వరరావు, వెంకట్రామయ్య, జనార్ధన, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు ద్విచక్ర వాహనాలు అపహరణ

రెంటచింతల, ఫిబ్రవరి 17 : మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని ఆంజనేయస్వామి మాణ్యంలో శుక్రవారం మూడు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. దాసరి నరసింహారావుకు చెందిన బుల్లెట్, సన్నెగంటి బ్రహ్మయ్యకు చెందిన పల్సర్, ఓంకార్‌కు చెందిన షైన్ వాహనాలను ఎత్తుకెళ్లారు. ఇటీవల బ్రాహ్మన వీధిలోని బావిపై అమర్చిన మోటార్లు కూడా చోరీకి గురయ్యాయి.

రామారావుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 17 : సత్తెనపల్లిలో శాంతియుతంగా మెగా డీఎస్సీ కోసం ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ యూత్ నాయకుడు రామారావుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దాడికి సంబంధించి మంత్రి అంబటి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు షేక్ బాబు ఉన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 17: మాచర్లకి చెందిన మాజీ కౌన్సిలర్ షేక్ రషీద్ శనివారం టీడీపీని వీడి వైసీపీలో చేరారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ కండువాను కప్పి రషీద్‌ను ఆహ్వానించారు.

కొమ్మాలపాటి శ్రీధర్‌కు టిక్కెట్ కేటాయించాలి

అచ్చంపేట, ఫిబ్రవరి 17 : పెదకూరపాడు నియోజకవర్గంలో మూడుసార్లు పోటీ చేసిన డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌కు టిక్కెట్‌ను కేటాయించాలని అచ్చంపేట మండల టీడీపీ నాయకులు కోరారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొమ్మాలపాటి శ్రీధర్‌కు టిక్కెట్‌ను కేటాయించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, ఎస్‌కే కాసుల, వెనిగండ్ల కోటయ్య, కోటపాటి అప్పారావు, పసుపులేటి పాపిరెడ్డి, సందెపోగు సామేలు, హరిబాబు, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, కే వీరాంజనేయులు, కొలగాని కుమారి, పఠాన్ గాలీసా, మండలంలోని 23 గ్రామాల ముఖ్య నాయకులు, గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

● క్రోసూరు, ఫిబ్రవరి 17 : ఎమ్మెల్యేగా ఉన్నా లేక పోయినా రెండు దశాబ్దాల నుంచి పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ క్యాడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్‌కే తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఇవ్వాలని పలువురు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నాయకులు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రతి గ్రామంలో పేరు పెట్టి పిలిచే అనుచరవర్గం కొమ్మాలపాటి వెంట ఉందని, కొత్తగా ఎవరికైనా టిక్కెట్ ఇచ్చినా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు స్వాగతించటం కష్టమని వారు తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దుద్దుల యోహాన్, సీనియర్ టీడీపీ నాయకులు పగడాల రాజు, చిలకా కృష్ణారావు, మేదర వాసు, ముక్కు రాయప్ప, పెరుమాళ్ళపల్లి నాగరాజు, చిలకా రవి కుమార్, బండారు ప్రసన్న, చిలకా కోటయ్య, బుల్లా బుల్లెయ్య, పలికినీడి ఏసయ్య, కోటయ్య, ఎర్ర శ్రీను, వర్దన్ తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్ పదోన్నతులను నిలిపి వేయాలి

పల్నాడు జిల్లా అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు దాసరి ఆదెయ్య

బెల్లంకొండ, ఫిబ్రవరి 17 : ప్రిన్సిపాల్ పదోన్నతుల్లో గోల్‌మాల్ జరిగాయని, పదోన్నతులను వెంటనే నిలిపివేయాలని జిల్లా ప్రభుత్వ కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు దాసరి ఆదెయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లైబ్రేరియన్ పీడీలకు ప్రిన్సిపాల్ పదోన్నతులు ఇస్తూ 2021 డిసెంబరు 8వ తేదీన జీవో ఇవ్వటం జరిగిందన్నారు. ఈ జీవోకు అనుగుణంగా జూనియర్ లెక్చ రర్ల లైబ్రేరియన్ పీడీలతో కలసి ఇంటిగ్రేడర్ల సీనియారిటీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ సంచాలకుల ద్వారా కమ్యూనికేషన్ చేయటం జరిగిందన్నారు. అధ్యాపకుల అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదించి జీఏడీ సర్వీసెస్ 33(ఏ), 34 ప్రకారం ఫైనల్ చేయాలని 22 సెప్టెంబరు 2022న ఆదేశించినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారన్నారు.

నిర్బంధాలు ఎదురైనా ఛలో విజయవాడకు వెళతాం

● సీపీఎస్ ఉద్యోగుల యూనియన్ నాయకుల ప్రకటన

క్రోసూరు, ఫిబ్రవరి 17 : ఎన్ని నిర్బంధాలు, అణచివేతలు ఎదురైనా ఓట్ ఫర్ ఓపీఎస్ అనే నినాదంతో ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళి తీరుతామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు పోలూరి పిచ్చయ్య, సాతులూరి రాఘవ, తూమాటి శరత్ కుమార్ స్పష్టం చేశారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. మండలంలో పలువురు యూనియన్ నాయకులకు శనివారం పోలీసులు నోటీసులు ఇచ్చి కార్యక్రమానికి వెళ్ళకూడదని చెప్పారన్నారు. కార్యక్రమానికి తప్పకుండా వెళ్తామని, విజయవంతం చేస్తామన్నారు. ఓపీఎస్ హామీని ఇవ్వటంతో పాటు మేనిఫెస్టోలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని చేర్చిన వారికే తమ ఓటు ఉంటుందని వారు తెలిపారు. ఉద్యోగుల సంఘం నాయకులకు ఆయా పాఠశాలల వద్దకు, కార్యాలయాల వద్దకు వెళ్ళి పోలీసులు నోటీసులిచ్చారు.

భేటీ బచావో, భేటీ పఢావో కార్యక్రమం

క్రోసూరు, ఫిబ్రవరి 17 : క్రోసూరులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం భేటీ బచావో, భేటీ పఢావో కార్యక్రమం జరిగింది. సీడీపీవో స్వర్ణ కుమారి బాల్య వివాహాల గురించి, లింగ వివక్ష గురించి, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా భేటీ బచావో, భేటీ పఢావో ర్యాలీని నిర్వహించారు. వందలాది మంది విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్లు మాధవి, షైమున్నీసా బేగం తదితరులు ఆధ్వర్యం వహించారు.

నిర్లక్ష్యానికి గురవుతున్న చేనేత పరిశ్రమ : రుషింగప్ప

పెదకూరపాడు, ఫిబ్రవరి 17 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీనత వల్ల చేనేత పరిశ్రమ నిర్లక్ష్యానికి గురైందని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప అన్నారు. మండలంలోని లగడపాడులో శనివారం జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రుషింగప్ప మాట్లాడుతూ చేనేత పరిశ్రమ మీద కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ విధించి నేతన్నల వెన్ను విరిచిందని, అరకొర నిధులతో చిన్న చూపు చూస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేనేతలకు సంబందించిన అన్ని రాయితీలు రద్దు చేసి నేతన్న నేస్తం అనే ఒక్క పథకంతో సరి పెట్టిందన్నారు. జిల్లా అధ్యక్షులు చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ చేనేత కార్మికులకు నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, జిల్లా గౌరవ సలహాదారులు వెంకటరావు, పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నియోజకవర్గ, మండలాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నాళం మట్టపల్లికి ఘన నివాళి

రెంటచింతల, ఫిబ్రవరి 17 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు నాళం మట్టపల్లి 63వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ చైర్మన్ కేవీ నాగేశ్వరరావు శనివారం రామాలయం సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నలుగురు పేద విద్యార్థులకు రూ.16 వేల నగదును అందచేశారు. కార్యక్రమంలో నాళం సోదరులు, ఎల్‌ఐసీ డీవో బిక్షాలు నాయక్, సేవా సమితి అధ్యక్షులు గోవిందరెడ్డి, పాపిరెడ్డి, కొక్కుండ్ల బ్రహ్మం, ఏచూరి కొండలు, రాంబాబు, నరసింహారావు పాల్గొన్నారు.

16వ వార్డులో పవనన్న ప్రజాబాట

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : పట్టణంలోని 16వ వార్డులో శనివారం రాత్రి పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రి నగర్‌లోని సియోన్ దేవాలయంలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు, నాయకులు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, బత్తుల కేశవ, కంభంపాటి అబ్రహం, నామాలపుష్పలత పాల్గొన్నారు.

సూర్యకాంతిని ఎవరూ ఆపలేరు : కన్నా

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : అరచేతిని అడ్డు పెట్టి సూర్యకాంతిని ఆపలేరని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా టీడీపీకి వస్తున్న ప్రజాభిమానాన్ని ప్రభుత్వం ఆపలేదన్నారు. ఇంకొల్లులో రా కదలిరా సభను అడ్డుకోవాలని జగన్ ప్రయత్నించాడన్నారు. అయినా సభ విజయవంతమైందన్నారు. సభను విజయవంతం చేసిన పార్టీ నేతలకు, కార్యకర్తలకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ మెప్పు కోసమే అంబటి విమర్శలు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : వైఎస్ జగన్ మెప్పు కోసం చంద్రబాబు, లోకేశ్‌లపై మంత్రి అంబటి అడ్డగోలు విమర్శలు చేస్తున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను తిడితేనే సీట్లు వస్తాయని నమ్మిన అంబటి ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారన్నారు. సత్తెనపల్లిలో అంబటి కుర్చీని జగన్‌రెడ్డి ఇప్పటికే మడత పెట్టేశారన్నారు. దీనిని తట్టుకోలేక అంబటి మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. వైఎస్‌ఆర్ కుర్చీని, వైఎస్ వివేకానందరెడ్డి కుర్చీలను మడత పెట్టిన హంతకులు ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. అధికారం కోసం కుటుంబ సభ్యులను బలి తీసుకున్న నర రూప రాక్షసుడు ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ అర్థ మైందన్నారు. మరోసారి అధికారి కోసం తల్లి, చెల్లిని కూడా టార్గెట్ చేస్తున్న మోస్ట్ వాంటెడ్ కిల్లర్ ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు.

బీసీలపై హత్యలను ఖండించని అనిల్ కుమార్ యాదవ్

రాజుపాలెం, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పల్నాడు జిల్లాలో యాదవులను వైసీపీ రౌడీలు హత్యలు, దాడులు చేస్తుంటే వైసీపీ నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్ యాదవ్ ఎక్కడకు పోయాడని నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు రాఘవయాదవ్ ప్రశ్నించారు. రాజుపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైసీపీ రౌడీలు దాడులు చేస్తుంటే మాట్లాడటం చేతకాని అనిల్‌కుమార్ యాదవ్ ఈ రోజు కులం కార్డు ఉపయోగించుకొని నా బీసీలు, నా యాదవులు నన్ను ఆశీర్వదించాలని మాట్లాడటం అవివేకమన్నారు. జిల్లాలో బీసీలపై హత్యలు, దాడులు చేస్తుంటే మాట్లాడని నీకు ఇక్కడ పోటీ చేసే అర్హత లేదన్నారు.

కన్నా నాగరాజు ప్రచారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు శనివారం రాత్రి పట్టణంలోని 17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట టీడీపీ నేతలు ఆరేపల్లి ఏడుకొండలు, ఎలినేడి లక్ష్మీ తులసీ, జానీ ఖాజావలి, అంబిక, 16వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ నా యకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ సందర్భంగా కన్నా నాగరాజును ఘనంగా సన్మానించారు. అలాగే పట్టణంలో ని 23వ వార్డులో పలువురు టీడీపీ నేతలను గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు కలిశారు. పార్టీకి సంబందించిన వివిధ అంశాల పై చర్చించారు. పార్టీ నేతలు నాగరాజును ఘనంగా సన్మానించారు.

అంబటిపై ఫిర్యాదు చేస్తాం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 17 : నియోజ కవర్గంలో మంత్రి అంబటి రాంబాబు పెద్ద అల్లుడు ద్వారా పంచాయతీ కార్యదర్శుల నుంచి గ్రామాల వారీగా ఓటరు కులం, ఫోన్ నెంబర్లను అనధి కారికంగా సేకరిస్తున్నారని టీడీపీ నేత లు అన్నారు. టీడీపీ ప్రజా వేదికలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అంబటి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని వర్గాలకు తాయిలాలు ఇచ్చి ఉన్నారన్నారు. ఓటరు కులం, ఫోన్ నెంబరును సేకరిస్తున్న విషయంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని నాయకులు ఆళ్ళ సాంబయ్య, పూజల వెంకట కోటయ్య, కంభాల వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావులు పేర్కొన్నారు.

టీడీపీలోనే దళితులకు మేలు

నకరికల్లు, ఫిబ్రవరి 17 : దళితులకు టీడీపీలోనే సముచిత స్థానం లభిస్తుందని నకరికల్లు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనుమూరి దానియేలు అన్నారు. నకరికల్లు మండలం కండ్లకుంటలో శనివారం రాత్రి స్థానిక టీడీపీ నేతలతో పాటు దళిత నేతలు దళిత చైతన్య యాత్రల్లో పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం వచ్చాక 27 ఎస్సీ పథకాలను రద్దు చేసినట్టు తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీప ఏడుకొండలు, పాలడుగు శ్రీనివాసరావు, గంగవరపు విశ్వేశ్వరరావు, రావెల లింగయ్య, మాజీ సర్పంచ్ పమిడి రామయ్య, బొర్రా చిన కోటయ్య, గన్నెపూడి ఆనందరావు, యాసారపు యర్రయ్య, ఎస్ చక్రవర్తి, ఎం ఏసుదాను, మందా సంతోష్ కుమార్, నరసింహారావు, బండారు నాగరాజు, జంగాల శ్రీనివాస్, కనుమూరి ఇమ్మానియేలు, మందా ప్రభుదాను పాల్గొన్నారు.

శేషయ్యకు కన్నా నివాళి

రాజుపాలెం, ఫిబ్రవరి 17 : కొత్త బోదనం గ్రామానికి చెందిన సాతులూరి శేషయ్య మృతి చెందగా ఆయన చిత్రపటానికి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, మాజీ పార్టీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, వాణిజ్య విభాగం నాయకులు తోట శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాసా వెంకటేశ్వర్లు, పగడాల శ్రీను, చాట్ల దేవదాను, జనసేన నాయకులు కేదారి రమేష్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

బహిరంగ ప్రకటన

[illegible]

బహిరంగ ప్రకటన

[illegible]

బహిరంగ ప్రకటన

[illegible]

29తేదీ లోపు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: రాష్ట్రప్రభుత్వ పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా ఈ నెల 29వ తేదీ లోగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పెన్షన్ కార్యాలయంలోగాని, ట్రెజరీ కార్యాలయంలో గానీ అందజేయాలని నరసరావుపేట పల్నాడు జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం తెలిపారు. పెన్షన్ ఆఫీస్‌లో బయోమెట్రిక్/ఐరిష్ ద్వారా అందజేయవచ్చునన్నారు. నరసరావుపేట ట్రెజరీ పరిధిలో పెన్షనర్ల సంఖ్య 3231 మంది ఉన్నారని, వీరిలో 2511 మంది మాత్రమే లైఫ్ సర్టిఫికెట్స్ ఇచ్చారని ఏటీవో మౌలాలి చెప్పారు. ఇంకా 720 మంది లైఫ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలన్నారు.

ప్రణాళికాబద్ధమైన విద్యతోనే ఉన్నత స్థానం

● రైల్వే డివిజనల్ ఇంజనీర్ జాన్

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), ఫిబ్రవరి 17: జీవితంలో ఉన్నతంగా ఎది గేందుకు విద్య ఎంతో అవసరమని, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని రైల్వే డివిజనల్ ఇంజనీర్ జామళ్ళమూడి జాన్ అన్నారు. శనివారం మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి జాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, కృషి ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాదన్నారు. పేద కుటుంబంలో పుట్టి పెరిగిన తాను కనీస వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి ఐఈఎస్ పరీక్షల్లో విజయం సాధించానన్నారు. నేడు ఈ స్థానంలో ఉన్నానంటే దాని వెనుక ఎంతటి కృషి, పట్టుదల ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంతోపాటు లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీ శంకర్, ఉపాధ్యాయిని సునీత, పీఎంసీ ఛైర్మన్ ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నిశాఖల సమన్వయంతోనే ప్రమాదాలు అరికట్టగలం

● రూరల్ సీఐ సుధాకర్‌రావు

శావల్యాపురం, ఫిబ్రవరి 17: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసినపుడే రోడ్డు ప్రమాదాలను త్వరగా అరికట్టగలమని రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణపై స్థానిక జడ్పీ పాఠశాలలో డ్రైవర్లు, విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు రోడ్ల భద్రతపై ప్రత్యేక తరగతులు నిర్వహించడం, వారిచే ప్రతిజ్ఞ చేయించడం, ప్రేరణ తరగతులు నిర్వహించడంపై హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ చల్లా సురేష్, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవో నికర లాభం రూ.7.75లక్షలు



ఎఫ్‌పీవో గ్రూపు లీడరుకు చెక్కు అందజేస్తున్న ఎంపీపీ ఝాన్సీ దయాసాగర్

యడ్లపాడు, ఫిబ్రవరి 17: ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో) ఆరో సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఝాన్సీ దయాసాగర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా 2022-23 ఆడిట్ నివేదికను వెలుగు ఏపీఎం జీవన్ చదివి వినిపించారు. ఎఫ్‌పీవో బిజినెస్ ఫండ్ ఆరేళ్ళ క్రిందట రూ.35 లక్షలతో ప్రారంభించారన్నారు. అవసరమైన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఫండ్ నుంచి రుణాలను మంజూరు చేశారన్నారు. దీనితో ఆరేళ్ళలో చేసిన రొటేషన్‌తో టర్నోవర్ రూ.2కోట్లకు చేరిందన్నారు. ఆరేళ్ళలో జరిగిన టర్నోవర్‌పై రూ.21లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.7.75లక్షల నికరలాభం వచ్చిందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోనే యడ్లపాడు ఎఫ్‌పీవో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఎఫ్‌పీవో ఫండ్ నుంచి రూ.10.50 లక్షలు, ఆదర్శ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి బ్యాంకు ద్వారా మంజూరైన రుణం రూ.10లక్షల చెక్కులను ఎంపీపీ అందజేశారు. కార్యక్రమంలో డీపీ ఎం శ్రీనివాసరావు, ఏవో సరిత, ఎఫ్‌పీవో అధ్యక్షులు పూర్ణచంద్రరావు, ట్రెజరర్ చిన్నవీరయ్య, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ మాధవి, ఎఫ్‌పీవో సీసీ బి.హేమలత, సీసీలు నాగేశ్వరరావు, పేరమ్మ, రాములమ్మ, వీవోఏలు పాల్గొన్నారు.

శావల్యాపురం డీపీఈపీ పాఠశాలలో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవోలు సాంబశివరావు, లలితాకుమారి

శావల్యాపురం, ఫిబ్రవరి 17: వార్షిక తనిఖీల్లో భాగంగా శావల్యాపురం డీపీఈపీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి శనివారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయులు బోధన ప్రణాళిక, వర్క్‌బుక్స్, కాపీ రైటింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండి 17మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు సంఖ్యను కనీసం 25కు పెంచాలని సూచించారు. పాఠశాలలో టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ బోధనా విధానాన్ని అనుసరించి విద్యార్థులకు సులభతరమైన రీతిలో పాఠాలు బోధించాలని, విద్యార్థులు ప్రతిరోజూ టైంకి పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం పాఠశాల పరిసరాలు పరిశీలించారు. హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయిని జబీనా సుల్తానా, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బోయపాటి త్రివిక్రమ్, సీఆర్పీ ఎలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

22న వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17: మండలంలోని బోడిశంభునివారిపాలెం సమీపంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

న్యాయవాదులతో ఎంపీ ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట లీగల్ ఫిబ్రవరి 17: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగ న్యాయవాదులతో శనివారం పట్టణంలోని ఓ అతిథిగృహంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలో అత్యంత ప్రభావ శీలురైన వ్యక్తులని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేయటానికి తాను ఎంపీగా పోటీ చేశానన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా జిల్లాకు రూ.3వేల కోట్లతో జాతీయ రహదారులకు కృషి చేశారన్నారు. రూ.504 కోట్లతో జలజీవన్ మిషన్, రూ. 500 కోట్లతో పిడుగురాళ్లలో మెడికల్ కళాశాల, ఆస్పత్రి, రూ.340 కోట్లతో వరికపుడిసెల ప్రాజెక్టు శంకుస్థాపన, వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు కోసం కృషి చేశానన్నారు. మాచర్ల, రొంపిచర్లలో రెండు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేశామన్నారు. రూ.120 కోట్లతో నరసరావుపేట జేఎన్‌టీయూ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించామన్నారు. ప్రజల్లో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ ఎన్నికల్లో విజయం సాధించటానికి కృషి చేయాలన్నారు. విమర్శనాత్మక, నిర్మాణాత్మక దృష్టితో తనకు సూచనలు, సలహాలు అందించాలని కోరారు. నరసరావు పేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ నేత డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో టీడీపీ ప్రజల సమస్యలను పరిష్కరించటంలో, ప్రభుత్వ దురాగతాలను ఎండగట్టడంలో న్యాయవాదులు చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు చంద్ర ఆంజనేయులు, నరసరావుపేట న్యాయవిభాగ అధ్యక్షుడు చెన్నుపాటి నాగేశ్వరరావు, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల న్యాయ విభాగ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాదులు జీఎల్‌వీ రమణమూర్తి, సీజే ప్రతాప్, వెంకటేశ్వర్లు చౌదరి, ఆరోగ్యంచౌదరి, శ్రీనివాసరావు, జీవీ సుబ్బారావు, రవికాంత్, సీతారామాంజనేయులు, అమూల్య, రాధిక, చక్రపాణి, సురేష్, ఆలీం బాషా, న్యాయ విభాగ సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు ఏమైంది జగన్‌రెడ్డి?

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 17: పల్నాడు ప్రాంతంలో దుర్భర పరిస్థితుల నుంచి ఉపశమనం కోసం అమలు చేస్తామన్న డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు కనీసం నీకు గుర్తుందా.. జగన్‌రెడ్డి? అని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. పల్నాడు పార్లమెంట్ పరిధిలోని రెండు వందల గ్రామాలకు నీటి కష్టాలు తీర్చుతామన్న మాట ఎంత వరకు నిలబెట్టుకున్నారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజక వర్గాల కోసం అని ప్రకటించిన ప్రాజెక్టు వివరాలు వెల్లడించాలన్నారు. శనివారం పట్టణంలోని 27వ వార్డు రాగన్నపాలెంలో తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తల సమన్వయ సమావేశంలో స్థానిక సమస్యలపై వారితో చర్చించి ఓటరు జాబితా పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యం చేస్తే అధికార వైసీపీ వారు దొంగ ఓట్లతో గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయాలని ప్రత్తిపాటి దిశ, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నియోజక వర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్ మాట్లాడుతూ జగన్ చేస్తున్న అవినీతి, అక్రమాలు ప్రతి ఇంటికి వెళ్ళి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. జగన్ చెర నుంచి రాష్ట్రం విముక్తి పొందాలన్నదే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల లక్ష్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం

పట్టణంలోని 33వ వార్డు సంజీవనగర్ నందు మద్దమాల నరేష్ ఇటీవల మరణించటంతో విషయం తెలుసుకున్న ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి తన సానుభూతిని తెలియజేసి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని వార్డు అధ్యక్షుడు మూకిరి వీరాంజనేయులు, బూత్ కన్వీనర్ మూకిరి సతీష్, తుల శమ్మ, కందుల సుబ్బయ్య, చెల్లి విజయ, మూకిరి వీరేష్, ప్రేమయ్యల ద్వారా అందించారు.

కొనసాగుతున్న అన్నదానం

పట్టణంలోని కల్యాణి సెంటర్లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం శనివారం 644మందికి భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరీం, తూబాడు సుభానీ, టైలర్ ఖాజావలి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జవ్వాజి బుచ్చిబాబు తదితరులు పాల్గొని స్వచ్ఛందంగా సేవలు అందించారు.

గ్రామాల్లో ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఫిర్యాదు



వెలుగులో డబ్బులు డ్రా చేసిన ఆధారాలను ఎంపీడీవోకు చూపుతున్న సర్పంచ్ వీరగంధం ఆనంద్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17: గ్రామసచివాలయం, ఆర్బీకే ప్రారంభోత్సవాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఉమ్మడివరం గ్రామసర్పంచ్ వీరగంధం ఆనంద్ ఎంపీడీవో నర్సయ్యపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ బెల్లం కొండశివ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ వీరగంధం ఆనంద్ అసంతృప్తి వ్య క్తం చేశారు. ప్రజలతో ఎన్నుకోబడని (షాడోలు) వారితో సభ ఎలా నిర్వహిస్తున్నారంటూ నిలదీశారు. ఇప్పటికైనా గ్రామసచివాలయాలకు ఏర్పాటు చేసి న శంకుస్థాపన శిలాఫలకంపై తన పేరు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో రెండు మూడు రోజుల్లో తప్పనిసరిగా శిలాఫలకంపై సర్పంచ్ పేరు ఉండేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

సర్వసభ్య సమావేశానికి స్పందన కరువు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కరువైంది. మొత్తం 16మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే సభకు హాజరుకావడంతో కోరం ఉందని భావించిన అధికారులు సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశంలో ముందుగా ఉపాధి హామీ ఏపీవో కట్టా నాగేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 4 లక్షల పనిదినాలు ఉండగా 2023-24లో 4 లక్షల మందికి పని కల్పించామని, ఈ సంవత్సరం నూతనంగా రైతులకు అవసరమైన పనులు గుర్తించామని, నీటిగుంటలు ఏర్పాటు చేసేందుకు ఫాం హౌస్, నీటి నిల్వలకు అమృతసరోవర్ పథకం కింద ఎకరం నుంచి అర ఎకరం నీటి నిల్వలకు కుంటలు తీసుకోవచ్చని, ప్రధానంగా గ్రామాల్లోని కూలీలకు పని కల్పించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించా రు. ఉమ్మడివరం గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ వెలుగు పథకంలో పనిచేస్తున్నట్లు డబ్బులు డ్రా చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామసర్పంచ్ ఆనంద్ నిలదీశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు

● టీడీపీ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు గుంటుపల్లి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారని టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటి సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం నరసరావుపేట పల్నాడు టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గుంటుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అనిల్‌కుమార్ యాదవ్‌ను తీసుకొచ్చి పల్నాడు జిల్లాలో బీసీలకు న్యాయం చేస్తున్నామని మాట్లాడుతున్నారు. వైసీపీ వాళ్ళు అనిల్‌కుమార్ యాదవ్‌ను తీసుకువచ్చి అదే రోజు అదే సామాజిక వర్గం వాళ్ళ నెత్తురు కళ్ళచూడటమేనా బీసీలపై ప్రేమ? అని ప్రశ్నించారు. ఎవరు నిజంగా బీసీలపై ప్రేమ చూపిస్తున్నారో వైసీపీలో ఉన్న బీసీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు, అనిల్‌కుమార్ యాదవ్ అసెంబ్లీలో ఎన్ని ప్రగల్భాలు పలికాడో ప్రజలందరూ చూశారన్నారు. మంత్రి వర్గంలో నుంచి పనికిరాడని తీసివేసిన అనిల్‌కుమార్ యాదవ్‌ని ఈ రోజు పోటీ చేసే దిక్కులేక నెల్లూరు నుంచి అద్దెమైకు తీసుకొచ్చుకొని, నరసరావుపేటలో పోటీచేయిస్తామంటున్నారని అన్నారు. నెల్లూరులో చెల్లని నాణెం నరసరావుపేటలో చెల్లుతుందా? అని ప్రశ్నించారు. ఖచ్చితంగా ఆ చెల్లని నాణేన్ని నెల్లూరు పంపించడానికి పల్నాడుజిల్లాలోని బలహీనవర్గాలు ఎదురు చూస్తున్నారని చెప్పారు.

కోదండ రామాలయంలో చోరీ

రొంపిచర్ల, ఫిబ్రవరి 17: మండలంలోని సుబ్బయ్యపాలెంలో ఉన్న కోదండ రామాలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రామాలయంలోని హుండీని దొంగలు తీసుకెళ్లారు. హుండీలో సుమారు రూ.15వేలు వరకు నగదు ఉండవచ్చునని కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. రొంపిచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

● రాష్ట్ర బాలల హక్కుల సభ్యురాలు బత్తుల పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

నాదెండ్ల, ఫిబ్రవరి 17: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణపై శనివారం అవగాహన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయటం సాంఘిక దురాచారం అన్నారు. అమ్మాయి వయస్సు 18, అబ్బాయి 21 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే వివాహాలు చేయాలని సూచించారు. సమావేశంలో సీడీపీవో శాంతకుమారి, జడ్పీటీసీ కే మస్తాన్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, వైద్యాధికారి జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవంలో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 17: ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గుంటూరు పట్టణంలోని హిందూ కళాశాలలో శనివారం నిర్వహించిన గుంటూరు బాలోత్సవంలో శావల్యాపురం మండలం వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి అందరినీ ఆకట్టుకొన్నట్లు హెచ్‌ఎం మహబూబ్ సుభానీ తెలిపారు. విజేతలకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పీఎంసీ ఛైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, హెచ్‌ఎం సుభానీ, గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు, వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు, కోశాధికారి వీరాస్వామి అభినందించారు.

విద్యార్థులు రహదారి భద్రతా నియమాలు పాటించాలి

● డీటీవో పరందామరెడ్డి



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డీటీవో పరందామరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 17: విద్యార్థులు రహదారిపై ప్రయాణించేటప్పుడు రహదారి భద్రతా నియమాలు తప్పని సరిగా పాటించాలని జిల్లా రవాణ శాఖ అధికారి టీకే పరందామరెడ్డి తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరందామరెడ్డి మాట్లాడుతూ రహదారుల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా యువకులు మృతి చెందడం, గాయాలపాలవుతున్నా రన్నారు. విద్యార్థులందరూ రహదారి బద్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, 4 వీల్ నడిపే సమయంలో సీటుబెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపటం చట్టవిరుద్దమన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సత్యనారాయణప్రసాద్, తిరుమల కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంటు హెచ్‌వోడి జగదీష్, ప్లేస్‌మెంటు హెడ్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ సంక్షేమ వెలుగులు

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి గడపలోనూ సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంటు వైసీపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. తొలుత కార్యక్రమంలో పాల్గొనేందుకు జొన్నలగడ్డకు చేరుకున్న అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గ్రామ ప్రజలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్ళ కాలంలో జొన్నలగడ్డ గ్రామంలో రూ.28.26 కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పని కల్పించాలి

● సోషల్ ఆడిట్ ప్రజావేదికలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ జీ జోసెఫ్ కుమార్

బొల్లాపల్లి, ఫిబ్రవరి 17: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 15వ విడత సోషల్ ఆడిట్ ప్రజావేదిక శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 509 పనులకు రూ. 8,99,43,716కు వారం రోజుల నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందంచే తనిఖీలు నిర్వహించి మండలంలోని 33పంచాయతీల్లో సోషల్ ఆడిట్ బృందంచే గ్రామ సభలు నిర్వహించి శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. ఈ ప్రజావేదికలో మండలంలో ఎక్కువగా నిమ్మ, బత్తాయి వేసిన తోటలు ఎక్కడా కన్పించ లేదని సోషల్ ఆడిట్ బృందం ప్రజావేదికలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఎక్కువగా జాబ్ కార్డులను పూర్తి చేయడం లేదని మస్టర్స్ నందు సంతకాలు, వేలి ముద్రలు లేకుండానే నిధులు డ్రా చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జీ జోసెఫ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 11వేల జాబ్ కార్డులు ఉంటే ఇప్పటి వరకు 609 మంది మాత్రమే వంద రోజుల పని దినాలు విని యోగించుకున్నారని, వంద రోజుల పనిదినాలు కల్పిస్తే పేదవారికి, ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.27వేలు అందుతుందన్నారు. ఈ విధంగా గ్రామాల్లో రానున్న నాలుగైదు నెలలు వంద రోజుల పని దినాలు కల్పించాలని, ప్రతి శుక్రవారం గ్రామంలో ఉపాధి కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ బూసిరెడ్డి, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి టీవీ విజయలక్ష్మి, మీరావలి, సోషల్ ఆడిట్ బృందం ఎస్ఆర్‌సీపీ వెంకటేశ్వరరావు, ఏపీవో, ఈవోపీఆర్‌డీ, డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

మూడు సచివాలయాల్లో కలెక్టర్ తనిఖీలు



చిలకలూరిపేట సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 17 : పట్టణంలోని 18, 19, 20 సచివాలయాలను కలెక్టర్ శివశంకర్ గురువారం తనిఖీ చేశారు. సచివాలయాల్లోని వార్డు అడ్మిన్‌లు, వీఆర్‌వోలతో ఆయన మాట్లాడి పేదల ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్‌ల తాజా ప్రక్రియ గురించి ఆయన తెలుసుకున్నారు. సంబంధిత సాంకేతిక సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా? లేదా? అని ఆయన ఆరా తీశారు. సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉన్న సేవల గురించి సచివాలయాల కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల గురించి సంబంధిత బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక వీరముష్టి కాలనీలో ఉన్న ఓటర్లకు బెల్లంకొండలో కూడా ఓట్లు నమోదైనట్టుగా రాజకీయ పార్టీలు చేసిన ఫిర్యాదు గురించి ఆరా తీశారు. ఆ సమస్యలను తక్షణం పరిష్కరించి సరిచేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కూడా ఆయన బీఎల్‌వోలతో మాట్లాడారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నరసింహం, కమిషనర్ గోవిందరావు, ఎంపీడీవో శ్రీనివాస రావు, టీపీఎస్ సునీత తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గార్లదిన్నె అమ్మవారి జాతరలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వీరయ్య వ్యక్తిపై విచక్షణారహితంగా దాడిచేసి, కులం పేరుతో దూషించారని ఎమ్మార్పీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్యమాదిగ అన్నారు. శనివారం ఈ మేరకు నరసరావుపేటలోని ఆర్డీవో సరోజినిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీరయ్యమాదిగ మాట్లాడుతూ దాడిచేసిన చీమ సుధాకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ఎస్ నాయకులు జమ్ములమూడి విజయ్ మాదిగ, మల్లెల మధు, నందిగం పేతురు, వనికుంట మరియదాసు, నూనె అంకమ్మ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషిచేయడమే విజయ రహస్యం

● కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో సివిల్స్ అవగాహన సదస్సులో బాలలత

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 17: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయడమే గెలుపునకు విజయరహస్యం అని హైదరాబాద్ సీబీఎస్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ ఎం బాలలత అన్నారు. శనివారం నరసరావుపేటలోని కృష్ణవేణి మహిళా డిగ్రీకళాశాలలో సివిల్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎం బాలలత మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలి అనుకుంటే మనకు ఏమి కావాలి, మనం ఏమి చేయాలి అనే విషయాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై శ్రీకాంత్, అకడమిక్ డైరెక్టర్ టీ సురేఖ, ఎంఎం భాషా, ఎన్ నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ లీగల్ సెల్ సెక్రటరీగా కర్నాటి చెన్నకేశవరెడ్డి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 17: వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర సెక్రటరీగా సీనియర్ న్యాయవాది కర్నాటి చెన్నకేశవరెడ్డిని ఎంపిక చేయడంపై పట్టణంలోని ఆ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా చెన్నకేశవరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరాంజనేయచౌదరి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ టెస్ట్‌లో పేట విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 17: రాష్ట్ర స్థాయిలో జరిగిన ఒలంపియాడ్ టెస్ట్‌లో స్థానిక పెదనందిపాడు రోడ్డులోని వికాస్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని స్కూల్ డైరెక్టర్లు దండా పవన్‌కుమార్, దండా రోజశ్రీ శనివారం తెలిపారు. వారందరికీ ఈ సందర్భంగా సర్టిఫికెట్లను బహూకరించారు.

మిరప పంటపై రైతులకు అవగాహన

బొల్లాపల్లి, ఫిబ్రవరి 17 : మండలంలోని మన్నెపల్లి తండా, రావులాపురం, రేమిడిచర్ల, గుమ్మనంపాడు గ్రామాల్లో వినుకొండ ఉద్యానశాఖ అధికారి షేక్ నబీరసుల్లా ఆధ్వర్యంలో నల్ల తామర పురుగు ఆశించిన మిరప పంటలను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా శిక్షణ కో- ఆర్డినేటర్, జిల్లా వనరుల కేంద్రం ఎం శివకుమారి మాట్లాడుతూ రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం గురునాథం, వాగ్యానాయక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.